క్లుప్తంగా

జాతర పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఈ నెల 22 నుంచి 24 వరకు ఇప్పలతండాలో జరగనున్న లింగబసవేశ్వర స్వామి జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత కోరం సురేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో జాతర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు జర్పుల పద్మ, బానోతు శ్రీను, కోరం ఉమ, రంగీలాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్వహణకు సాయమందిస్తాం..

కొత్తగూడెంఅర్బన్: నూతన గ్రంథాలయానికి తమ సహాయ, సహకారాలు అందిస్తామని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించి సౌకర్యాలపై చర్చించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వపరంగా కార్పొరేట్ స్థాయిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో మాదిరిగానే పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి విశ్రాంత ఉద్యోగుల తరఫున సహకరిస్తామని చెప్పారు.

24న సేవాలాల్ జయంతి ముగింపు వేడుకలు

ఇల్లెందు: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఈ నెల 24 సోమవారం ఇల్లెందులో ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంఘం నేతలు, పెద్దలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకల ప్రత్యేక పూజా కార్యక్రమం ఉంటుందని, బంజరా సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం, జ్యోతి ప్రజ్వలన, భోగ్ బండారో ఉంటాయని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం కమిషనర్ శేషాంజన్ స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అన్నదానం



అనాథశరణాయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి 96వ పుట్టినరోజు సందర్భంగా యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు నాయకులు మంగళవారం జ్యోతి అనాథశరణాలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ మాట్లాడుతూ... సంజీవరెడ్డి సుమారు 70 సంవత్సరాల నుంచి కార్మికులకు అనేక సేవలందించారన్నారు. ఎమ్మెల్యేగా, కార్మిక శాఖ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నో సేవలందించరన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఉపాధ్యక్షులు పీతాంబర్‌రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బుడిగ రాజేశ్వరరావు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అయిలయ్య సంతాప సభ

జూలూరుపాడు: సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సంతాప సభను వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. రైతు, ప్రజా సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు చేసిన పోరాట యోధుడు కాసాని అయిలయ్య అని కొనియాడారు. అయిలయ్య మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి యాసా నరేష్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, సీపీఐ(ఎంఎల్) ఎన్డీ పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, వల్లమల చందర్‌రావు, బోడా అభిమిత్ర, బానోత్ ఇస్రా తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో గట్టెక్కేనా?

- అమలుకు నోచుకోని నూతన చట్టం
- కొనసాగుతున్న పాత ధరణి పోర్టలు
- కొత్త చట్టంపై రైతుల ఆశలు

భూ భారతి చట్టం భూ సమస్యలను పరిష్కరిస్తుందని రైతులు ఎన్నో ఆశలతో నిరీక్షిస్తున్నారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, సమర్థతను పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకుస్తోంది. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ ఆర్వోఆర్ – 2020 చట్టంతో పూర్తిస్థాయిలో రైతులకు ప్రయోజనం చేకూరలేదని ఇప్పటి ప్రభుత్వం దానిని ప్రక్షాళన చేసింది. దాని స్థానంలో కొత్తగా భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ఇది మార్చి నుంచి అమల్లోకి రానుందని అధికారులు చెబుతున్నారు. దీంతో మండలంలో పలువురు రైతులు భూ సమస్యలకు మోక్షం కలుగుతుందని ఎదురుచూస్తున్నారు.



పునుకుల గ్రామంలో ట్రాక్టర్‌తో భూమి దున్నుతున్న రైతు

పాల్వంచరూరల్: పాండురంగాపురం, రెడ్డిగూడెం, యానంబైల్ గ్రామాల్లో రైతుల భూములకు పట్టాలులేవు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో మండలంలో అనేక గ్రామాల్లో గిరిజనేతర రైతులకు భూములు ఉన్నా హక్కు పత్రాలు లేవు. ప్రధానంగా పాండురంగాపురం, రెడ్డిగూడెం, తవిసలగూడెం, యానంబైల్, కిన్నెరసాని తదితర గ్రామాల్లో గిరిజనేతర రైతులకు కొంతమందికి పాస్‌పుస్తకాలు ఉంటే మరికొంత మందికి లేవు. పాండురంగాపురం, రెడ్డిగూడెంలో సుమారు పదివేల ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవు.

తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు...

అవగాహన లేని పలువురు రైతులు గతంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్లను తెల్లకాగితాలపై (సాదాబైనామా) ఆధారపడి రాసుకున్నారు. అయితే రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో ఆ పత్రాలకు (సాదాబైనామా) చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కానీ అవి అమలుకు నోచుకోలేదు. తాజాగా ఇప్పటి ప్రభుత్వం ఆర్వోఆర్ కొత్తచట్టం ద్వారా భూ భారతి చట్టాన్ని ధరణి స్థానంలో తీసుకొస్తోంది.

భూములున్నా ప్రయోజనం సున్నా...

మండలంలో రైతులకు వందల ఎకరాల భూములు ఉన్నా పట్టాదారు పాసుపుస్తకాలు లేక రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. గతంలో రైతులకు భూములు ఉండి రెవెన్యూ పహణీలో పేరు ఉంటే రైతులు పెట్టుబడికి బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం ఉండేది. ధరణీ పోర్టల్ వచ్చిన తర్వాత రైతులకు భూమి ఉన్నా పట్టాదారు పాసు పుస్తకం లేకనోవడంతో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు తిరస్కరిస్తున్నాయి.

భూ సమస్యలు పరిష్కరించాలి..



భూమి ఉన్నా హక్కు పత్రాలు లేవు. 126 సర్వే నంబర్‌లో కొంత రెవెన్యూ, మరికొంత ఫారెస్ట్ భూమి ఉందని గతంలో పట్టాలు ఇచ్చిన భూములకు గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి పట్టాలూ ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టం రైతుల భూ సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని కోరుకుంటున్నాం.

– వీరారెడ్డి, రెడ్డిగూడెం

భూమి ఉంది.. పట్టా లేదు..



మండల పరిధి పాండురంగాపురంలో మాకు ఐదు ఎకరాల భూమి ఉంది. భూమి క్రమబద్ధీకరణ కోసం మూడు సంవత్సరాల క్రితం రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. కానీ ఇప్పటి వరకు పట్టాదారు పాసుపుస్తకం రాకపోవడంతో ఎంతో నష్టం జరిగింది. పెట్టుబడికి తీసుకున్న బ్యాంకు రుణం మాఫీ కాలేదు.

– సుందర్‌రెడ్డి, రైతు, పాండురంగాపురం

సమస్యలు పరిష్కారానికి అవకాశం..



భూ భారతి చట్టం ఎన్నికల కోడ్ కారణంగా అమల్లోకి రాలేదు. ప్రస్తుతం పాత పోర్టల్ ద్వారా క్రయవిక్రయాలు అమలు చేస్తున్నాం. ఈ భూ భారతి చట్టం అమల్లోకి వస్తే రైతుల భూ సమస్యలు అన్ని పరిష్కారించే విధంగా పొందుపరిచారు. మండలంలో పలు సమస్యలపై రైతులు దరఖాస్తులు ఇచ్చారు. అవి పరిష్కరించబడతాయి.

– వివేక్, తహసీల్దార్, పాల్వంచ

మిర్చి క్వింటా రూ.14,300



యార్డులో మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రం సోమవారం ప్రారంభం కాగానే తొలిరోజు అధికంగా జెండా పాట రూ.13,300 పలికింది. అత్యల్పంగా రూ.12,100, మోడల్ ధర రూ.12,500లకు కొనుగోలు చేశారు. రెండో రోజు మంగళవారం టేకులపల్లి సబ్ మార్కెట్ యార్డులో రికార్డు ధర పలికింది. బొమ్మనపల్లికి చెందిన రైతు వాంకుడోత్ మాన్‌సింగ్ తన తేజ మిర్చి పంటను తీసుకుని రాగా నాణ్యతను చూసిన ట్రేడర్లు పోటీ పడ్డారు. శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ నిర్వాహకుడు రూ.14,300లకు కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా ఖమ్మం మార్కెట్‌లో రూ.14,200, వరంగల్‌లో రూ.13,600 ధర పలకగా అత్యధికంగా టేకులపల్లిలో ధర పలకడం విశేషం. రెండో రోజు టేకులపల్లిలో 11 మంది రైతులు మిర్చి పంటను తీసుకుని రాగా 109 బస్తాల ఎరుపు, ఆరు బస్తాల తెలుపు మిర్చి యార్డులో విక్రయించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్3 కార్యదర్శి ఈ.నరేష్‌కుమార్, సూపర్‌వైజర్ వి.శ్రీనివాసరావు, ఏఎంసీ సిబ్బంది జి.రంజిత్, సీహెచ్ లక్ష్మయ్య, కార్తీక్, మునీర్, శ్రీనివాస్‌రావు, మోహన్‌రావు, హరికృష్ణ, మధు, విజయ, లక్ష్మి, ట్రేడర్లు పాల్గొన్నారు.

నేడు వామపక్షాల ఆందోళన..



ఇల్లెందు: మాట్లాడుతున్న శంకర్

ఇల్లెందు: కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజల నడ్డి విరిచిందని వామపక్ష నాయకులు ఆరోపించారు. మంగళవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో వామపక్ష పార్టీలు సమావేశమై బుధవారం ఇల్లెందులో జరగనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమాలోచనలు చేశారు. సీపీఐ జిల్లా నాయకుడు డి.శంకర్ మాట్లాడుతూ.. కేంద్రం కార్పొరేట్ శక్తులకు అనుకూల బడ్జెట్ ప్రవేశపెట్టి కార్మికుల, కర్షకుల, పేదల నడ్డి విరిచిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ ఉపసంహరించుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి 50 శాతం నిధులు కేటాయించి పట్టణాలకు వర్తింపజేయాలని కోరారు. ఎస్టీ, ఎస్సీ, మహిళా రంగాలకు అత్యధికంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేటి కిరణ్, రాసుద్దీన్, నాయిని రాజు, మోహన్‌రావు, బంధం నాగయ్య, తాళ్లూరి కృష్ణ, సురేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బుధవారం జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో వామపక్ష నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు వై.గోపాల్‌రావు, మండల కార్యదర్శి బానోత్ ధర్మా తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ అప్‌డేట్ చేయండి..



కమిషనర్ కనకమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సీఎంపీఎఫ్ 2024 మార్చి వరకు అప్‌గేట్ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు పాస్‌బుక్‌లు అందజేయాలని, సీఎంపీఎఫ్‌ను ఆన్‌లైన్ చేయాలని, లోన్ సదుపాయం కల్పించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ కనకమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మాట్లాడుతూ.. రెండేళ్లుగా సీఎంపీఎఫ్ లెక్కలు అప్‌డేట్ చేయకపోవటంతో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బంధం నాగయ్య, రాజారం, వలీ, పండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి..

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు తెలిసేలా చర్యలు తీసుకోవాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. మంగళవారం టీయూసీఐ ప్రతినిధి బృందం కమిషనర్ కనకమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

26న మహా శివరాత్రి ఉత్సవాలు

ఇల్లెందు: ఈ నెల 26న సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మహా శివరాత్రి ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికార కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. గత ఏడాది నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల తరహాలో ఈసారి కూడా ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు టాలెంట్ టెస్ట్

జూలూరుపాడు: 20న జూలూరుపాడులో ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ తెలిపారు. మంగళవారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం చేసినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, అనిల్, ప్రవీణ్, సాయి చరణ్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బాలమేళా పోటీలు





హెచ్‌ఎం మీరా సాహెబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎంలు

జూలూరుపాడు: జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 13 పాఠశాలలకు మంగళవారం స్థానిక పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ బాలమేళా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణిత పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య బహుమతులు అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బెస్ట్ స్కూల్స్‌గా ఎంపికైన ఎర్రతండా, గుండెపుడి, వెంగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలకు ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బి.నేతాజీ, బి.శ్రీను, డి.భాస్కర్, పి.సరిత, డి.నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం..

అన్నారుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపకొల్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్‌ను టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఘనంగా సన్మానించింది. పాపకొల్లు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు, జిల్లాలోని ఉత్తమ కాంప్లెక్స్‌గా నిలబెట్టిన హెచ్‌ఎం మీరా సాహెబ్‌ను టీఎస్‌టీటీఎఫ్ నాయకులు సత్కరించారు. ధరావత్ హనుమా జాదవ్, డి.స్వరూపరాణి, బి.వస్రాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెంచాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుకృత

ఇల్లెందురూరల్: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత సూచించారు. మండలంలోని రొంపేడు పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత నెలలో ప్రసవాల సంఖ్య తక్కువగా నమోదైందని, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం పొందేలా ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం వేసవి ప్రారంభం అవుతున్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటి నుంచే అప్రమత్తం చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



సులానగర్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

టేకులపల్లి: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీన కార్యక్రమంలో మంగళవారం టేకులపల్లి మండలంలో జరిగింది. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేరుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ టీచర్లతో కూడిన మానిటరింగ్ బృందం మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ సులానగర్, ముత్యాలంపాడు మూడు పాఠశాలల్లో పర్యటించారు. పదో తరగతి విద్యార్థుల నోట్ బుక్స్, ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ బృందం సభ్యులు హైమవతి, దేవసింగ్, వీరన్న, కిషోర్, శంకర్, మోహన్‌రావు, బాబూరావు, సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ, కార్యదర్శి అభిమన్యులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశం జరిగింది. మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థుల డైట్ చార్జీలు రూ.8 మాత్రమే ఇస్తున్నారని, అవి ఏమాత్రం సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాటిని రూ.20కి పెంచాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



నాగారం కాలనీ వద్ద చెక్‌పోస్టులో ఉద్యోగులు

పాల్వంచరూరల్: ఇసుక అక్రమ రవాణా వ్యవహారంపై పాల్వంచ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనికి స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖల ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై నిఘాను తీవ్రతరం చేశారు. మండలంలోని నాగారం కాలనీ సమీపంలోని ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో బీసీఎం జాతీయ రహదారి పక్కన రెండు రోజుల క్రితం మూడు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టులో రేయింబగవళ్లు ఇసుక అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారుల పహారా కాస్తున్నారు. రహదారిపై ఇసుక, మట్టిని తరలించే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్ఐ హచ్యా తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆహ్వానం..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బతికించుకోవాలనే ఆలోచన.. ప్రైవేటుకు దీటుగా బోధన అందిస్తున్నామనే భరోసా.. విద్యార్థుల సంఖ్య పెంపుతో కళాశాల స్థాయి పెంచాలన్న లక్ష్యం.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయం.. కలగలిసి ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. తాజా ప్రచారంతో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు శ్రమిస్తున్నారు.

- ఇంటర్ కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు అవగాహన
- ఇల్లెందు డిగ్రీ కళాశాల అధ్యాపకుల వినూత్న ప్రచారం
- ప్రవేశాల సంఖ్య పెంపే లక్ష్యంగా ముందస్తు ప్రయోగం



కారేపల్లి ఇంటర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు పట్టణం, సమీపంలోని టేకులపల్లి, గుండాల, కారేపల్లి, బయ్యారం, కామేపల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలకు ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు వెళ్తున్నారు. డిగ్రీ కళాశాలలోని కోర్సుల వివరాలు, తెలంగాణ స్టేట్ నాలెడ్జ్ సెంటర్, ఇంగ్లిష్, తెలుగు లాంగ్వేజ్ ల్యాబ్‌లు, ప్రాజెక్టర్‌తో విద్యాబోధన, గ్రంథాలయం, విద్యార్థి కేంద్రంగా సమాలోచ, విస్తరణోపన్యాసం, ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం అధునాతన సామగ్రితో జిమ్ వంటి సౌకర్యాలతో పాటు సుదీర్ఘ అనుభవం, అంకితభావం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని ప్రచారం చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు కొన్నేళ్లుగా సాధించిన విజయాలను ఉదహరిస్తూ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరుతున్నారు. తమ కళాశాలలో చేరేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు విజ్ఞప్తి చేస్తున్నారు

ప్రవేశాల సంఖ్య పెంపే లక్ష్యంగా..

ఇంటర్ తరువాత చాలామంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో ప్రవేశాల కోసం ప్రయత్నిస్తూ కోచింగ్‌లకు వెళ్లడం, అక్కడ అవకాశం లభించని పక్షంలో ఆర్థిక స్తోమత ఉన్న వారు పట్టణాల్లోని ప్రైవేటు కళాశాలలో చేరుతుండగా మిగతా వారిలో అత్యధికులు స్థానికంగా ఉండే ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ప్రభుత్వ కళాశాలల కంటే ప్రైవేటు కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండేది. కానీ మారిన పరిస్థితుల్లో ప్రవేశాలు తగ్గి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచి పూర్వ వైభవం సాధించాలన్న తపనతో అధ్యాపకులు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రోజువారీ విధులకు ఆటంకం కలగకుండా బృందాలుగా ప్రచారం చేస్తున్నారు.

హాజరు శాతం పెంచేందుకు..

కళాశాలలో ప్రవేశాల పెంపుకు విద్యార్థుల ఉత్తీర్ణతను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనికోసం అధ్యాపకులు ఉదయమే కళాశాలకు హాజరై రోజుకు ఒక గ్రామాన్ని సందర్శించి తల్లిదండ్రులతో సమావేశమవుతున్నారు. విద్యార్థులు ప్రతీరోజు కళాశాలకు హాజరైతే కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిస్తూ హాజరు శాతం పెంచడంలో సఫలీకృతం అవుతున్నారు. కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 480 మంది విద్యార్థులు ఉండగా 95శాతానిక మించి హాజరు నమోదవడం విశేషం.

మెరుగుపడిన విద్యాబోధన..

కళాశాలలో బీఏ తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమం, బీఏ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ బీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్ కోర్సులు ఉన్నాయి. ప్రిన్సిపాల్‌గా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చిన్నప్పయ్య, నిష్ణాతులైన అధ్యాపకులు సైతం బదిలీ ప్రక్రియలో భాగంగా ఇల్లెందులో బాధ్యతలు స్వీకరించారు. వీరి రాకతో కళాశాలలో బోధన పద్ధతులలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి.

బస్సు సౌకర్యం కూడా..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పట్టణ శివారు ప్రాంతంలో ఉంది. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు కళాశాలను చేరుకునేందుకు బస్టాండ్ నుంచి 4 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. గతంలో ఉదయం, సాయంత్రం డిగ్రీ కళాశాల వరకు ఆర్డినరీ బస్సులు నడిపేవారు. ఈ సౌకర్యంతో విద్యార్థులు అధిక సంఖ్యలో కళాశాలకు చేరుకునేవారు. కానీ నేడు డిపో ఏర్పాటైనా ఆ సౌకర్యం లేదు. దీనికోసం ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేసినా బస్టాప్ ఏర్పాటుకు నోచుకోలేదు. ఇది కూడా విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపుతోందని స్థానికులు అంటున్నారు.

నాణ్యమైన విద్యకు భరోసా..



ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యకు భరోసా ఉంది. అనుభవం, అంకితభావం కలగలిసిన అధ్యాపకులు ఉన్నారు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా సౌకర్యాలు ఉన్నాయి. ఈఏడాది 200లకు మించి విద్యార్థుల చేరికలు లక్ష్యంగా ముందుస్తు ప్రచారం చేస్తున్నాం.

– చిన్నప్పయ్య, ప్రిన్సిపాల్, ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల